

★ వేప మందు ఇస్తున్న దృశ్యం

రోజులు 25 పైసలు వుండే చాప పిల్ల మృగశిర కార్తె రోజున 6 రూపాయల ధర పలుకుతుంది. మందును డబ్బులకు అమ్ముకుంటే మందు ప్రభావం పోతుందనే తలంపుతో తాము డబ్బులు తీసుకోమని చెప్పారు. ఈ పని నిర్విఘ్నంగా సాగేందుకు తాము తమ ఇంటిని కూడా కుదవ పెట్టామని ఈ సంవత్సరం దాదాపు వంద కేజీల మందును తయారు చేసామని చెప్పారు. ఈ పనికి ఎందరో స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు ప్రతి సంవత్సరం వచ్చి రోగులకు ఉచిత సేవ చేస్తారని చెప్పారు.

ప్రతి ఏడాది రద్దీ అధికమవడంతో ఎక్కడైనా విశాల ప్రాంతంలో మందు ఇవ్వచ్చుగదా అని ప్రశ్నిస్తే, ఈ మందు పని చేయడానికి తమ ఇళ్ళు అచ్చి వచ్చిందని గౌడ్ అన్నదమ్ములు చెప్పారు.

— ఎ.ఎస్.కె. చక్రవర్తి.

# అదీ సంగతి!

జాతీయస్థాయి ఫోటో కాంపిటేషన్‌కి ఫోటో గ్రాఫర్ మోహన్ ఒక మంచి ఫోటో తీసి పంపించాలనుకున్నాడు.

మంచి ఫోటో కోసం అన్వేషించసాగాడు. తను తీసిన పాత ఫోటోలన్నింటిని ఒకసారి తిరగేసి చూశాడు. ఏదైనా అయిడియా వస్తుందేమోనని.

అందులో తనకి నచ్చిన ఫోటో ఒక్కటీ కనిపించలేదు. ఏం చేయాలో తోచకపోవడంతో.

జేబులోంచి ఛార్మినార్ సిగరెట్ ప్యాక్ తీసాడు. అందులోంచి ఒక సిగరెట్ తీసి వెలిగించాడు. ఈజీ చైర్‌లో కూర్చుని సిగరెట్ కాలుస్తూ ఆలోచించ సాగేడు.

సిగరెట్ సగం కాలిన తర్వాత మస్తిష్కంలో ఒక మెరుపులాంటి ఆలోచన మెరిసింది.

అంతే! రెట్టింపు ఉత్సాహంతో లేచి తన గదిలోకి వెళ్ళాడు.

గదిలోంచి చాక్‌పీస్, కెమేరాతో పది నిమిషాల్లో వచ్చాడు.

సరిగ్గా ఆ సమయానికే తన బెస్ట్ ఫ్రెండ్ గోవింద్ వస్తూ కనిపించాడు.

సరైన సమయానికి వస్తున్నందుకు మనసులో మిత్రునికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

రోడ్డు పక్కనున్న గోడమీద "ఇచ్చట ఉచ్చలు పోయరాదు" తాటికాయంత అక్షరాలు గుండ్రంగా రాసి, దానికెదురుగా నిలబడి గోవింద్‌ని ఉచ్చ వేయమన్నాడు.

గోవింద్ రోడ్డు మీద నిలబడి అటూ యిటూ చూశాడు. ఎవరూ రావడంలేదని నిర్ధారించుకున్నాక మోహన్ చెప్పినట్టు చేశాడు.

ఆ దృశ్యాన్ని తన కెమేరాలో బంధించాడు మోహన్.

మిత్రుడికి కృతజ్ఞతలు చెప్పాడు ఫోటో కాంపిటేషనకి ఆ ఫోటో పంపి, రిజల్టు కోసం నిరీక్షించసాగాడు.

★ ★ ★ ★ ★

నాలుగు వారాల తర్వాత.

జాతీయ ఫోటో కాంపిటేషన్ రిజల్టు అన్ని ప్రముఖ దినపత్రికల్లో వచ్చాయి.

మోహన్ తీసి పంపిన ఫోటోకే 'ఫస్ట్ ప్రైజ్' వచ్చింది. అతను ఆనందంతో ఎగిరి గంతెయ్యలేదు. సంతోషంగా విని ఊరుకున్నాడు.

అతనికి ముందే తెలుసు తన ఫోటోకే మొదట బహుమతి వస్తుందని. ఎందుకంటే! తను ప్రయోగించిన ట్రిక్కు అలాంటిది.

— భీశెట్టి శ్రీనివాసరావు

